నన్ను నన్నుగా ప్రేమించు

సింగంపల్లి సూర్యకుమారి

"కమల మీతో అసలు ఏం చెప్పలేదా?" మరోసారి వీధి చివరివంకు చూసి, లోపలికి వస్తూ అడిగాడు విశ్వం.

అతను ఆ మాట అడగటం నాలుగోసారి.

గదికి ఓ మూలగా, మంచంమీద పడుకొన్న ముసలాయన 'చెప్పలేదనట్టు' నీరసంగా తల అడ్డంగా వూపాడు.

వంటగది గుమ్మం మొదట్లో కూర్చుని మిరియాల కషాయం నూరుతున్న పార్వతమ్మ మాత్రం మొహాన్ని చాటు చేస్తున్న తలుపు రెక్కను బార్లా తీసి మరోసారి అతనివంక నఖశిఖ పర్యంతం పరీక్షగా చూసింది.

చెరిగిన పెళ్ళిబొట్టు, రేగిన జుట్టు, ఎర్ర జీరలు తేలిన కళ్ళు, ఖరీదైన నలిగిన బట్టలు... నిటారుగా నిలబడి, తన సమాధానం కోసమన్నట్టు తనవేపే ఆతృతగా చూస్తుండటంతో, మొహం చిట్లించింది పార్వతమ్మ.

"ఏనాడు మాత్రం మనసులో మాట

మాతో చెప్పిందని, ఈనాడు మా పెద్దరికాన్ని నిలబెడుతుంది.'' అంది రుస రుసలాడుతూ.

విశ్వం మళ్ళీ ఏదో అడిగే లోపలే ''చిన్న మాట, బదర్!'' అంటూ లోపలనుంచి ముప్ఫైఏళ్ల వ్యక్తి ఇవతలకొచ్చాడు.

''మా కమల వుంది చూసావ్... అది ఈ యింటికి పునాదిలాంటిది. చాకిరీచేసే ఓ యంత్రం. అలాంటి పెన్నిధి, నిద్ర మంచంమీద కనిపించక పోయేసరికి మా అమ్మకి చెడ్డ జెలసీగా వుంది.'' అన్నాడు అతను.

అతను మాట్లాడేతీరునిబట్టి బాగా తాగి వున్నట్టు గ్రహించాడు విశ్వం. అతను విశ్వం పక్కనచెక్క పెట్టె మీదకూర్చుని,జీవితవిలువల గురించి, మధువు తాగటం వలన మనసెంత తేలికగా వుంటుందో, ఎలాంటి సుఖాన్ని పొందవచ్చునో; ఓ అరగంట వరకు విడిచి పెట్టకుండా వుపన్యాసమిచ్చాడు.

విశ్వం ఆ సారా వాసనను భరించలేక పోతున్నాడు.

ముఖ్యంగా ఆ అతివాగుడు. అయిష్టంగా అతని మాటలు వింటున్నాడేగానీ, విశ్వం మనసులో కమల 'ఏమైపోయింది?' అన్న ప్రశ్నతో నిండిపోయింది అతని చూపు వీధి వాకిలిమీదే నిలిచిపోయింది.

''ఇంతకీ నేను చెప్పొచ్చేదేమిటంటే, మా కమలకి కష్టాలతో ఆరంభమైన జన్మ మళ్ళీ నా రూపంలో ప్రత్యక్షమై అంతిమయాత్రకి దోహదం చేసిందేమో అని నా అనుమానం. ప్చ్...పిచ్చిది. సుఖపడటం తెలియదు''

విశ్వం, చివరి మాటలకి వులిక్కిపడి తల తిప్పి చూసాడు. అప్పటికే ఆ వ్యక్తి లేచి నిలబడి వంటగదివేపు అడుగులేస్తున్నాడు.

'నిజంగా కమల ప్రాణాలు తీసుకోవటానికే తెగించిందా?' ఆ వూహే విశ్వం మనసును నిలువునా ఒణికించింది.

'ఛీ. తనెంత తెలివి తక్కువ వాడు. నిన్న ఆ పొద్దు రాగానే వచ్చి వుండాల్సింది. అసలు మొదటినుంచి తన ఈ నిర్లక్ష్యమే తనకి మనశ్శాంతిని లేకుండా చేస్తోంది.

యింతక్రితం వచ్చిన వ్యక్తి పార్వతమ్మతో ఘర్షణ పడుతున్నాడు.ఆవిడఏమిటో యివ్వను పొమ్మని కేకలేస్తోంది. ఐదు నిముషాల్లోనే యువతలకి వచ్చాడు అతను.వూరికినే కాదు. అనుకున్నది. సాధించి మరి. అతని చేతిలో రెండు రూపాయల కాయితం రెపరెపలాడుతోంది. అతనితో పాటే ఆవిడ తిట్లు, శాపనార్థాలు వినిపిస్తున్నాయి. అయినా అతను పట్టించుకున్నట్లులేదు.

''వస్తాభాయీ!'' విశ్వం వేపు విజయ గర్వంతో చూస్తూ చేయి వూపి బయటకి వెళ్లిపోయాడు.

ఈ వాతావరణం ఆ యింట్లో పరిపాటే అన్నట్టుంది ఆవిడ తిట్లపరంపర వింటుంటే.

ఒక్క క్షణం విశ్వం మనసు ఆ వాతావరణాన్ని భరించి, మళ్ళీ కమల చుట్టూ అల్లుకు పోయింది.

తన ఆశా సౌధాలన్నీ కూలిపోయి, అందిన పెన్నిధి ఏదో చేజారిపోయిన ఆవేదనతో మూర్తీభవించిన దైన్యంతో చివరిసారిగా కనిపించిన కమల రూపం విశ్వం మనసుని రంపపు కోతకి గురిచేస్తోంది.

'భగవాన్' జీవితంలో యిలాంటి క్షణాలు ఎదురవుతాయని ఎన్నడూ అనుకోలేదు. అనుకోనివి జరిగిపోవటం నీ లీల కాబోలు. అయితే నీ యీ లీలలో కమల పాత్ర మాత్రం ముగించకు తండ్రి.' అనుకున్నాడు.

అప్రయత్నంగానే అతని కనుకొలుకుల్లో నీళ్ళు నిలిచాయి.

ఆలోచనలు అతన్ని గతంలోకి లాక్కెళ్లినాయి!

* * *

విశ్వం అన్నకి విశాఖ నుంచి ఏలూరు ట్రాన్స్‌ఫర్ అయింది. కొత్తచోటు కొత్త వాతావరణం వలన, నాలుగు రోజులకే విశ్వానికి విసుగ్గా అనిపించింది.

విశ్వం తండ్రి చిన్నతనంలోనే పోయాడు. అప్పటి నుంచి అతని బాధ్యత అన్న వదినల మీద పడింది. ఈ క్షణం వరకు అతనికి ఏ లోటు లేకుండానే పెంచుకొచ్చారు వాళ్ళు. విశ్వం తల్లి యిటు పెద్ద కొడుకు దగ్గర, అటు పెళ్ళయిన కూతురు దగ్గర వుంటూ వచ్చేది. కూతురి అత్తగారు పోయిన దగ్గర నుంచి. నాలుగైదేళ్ళుగా హైద్రాబాద్‌లోనే వుంటోంది. అప్పుడప్పుడు కొడుకుల్ని చూడటానికి వస్తూంటుంది.

విశ్వం బి. ఏ. మానేసి రెండేళ్ళు అయినా విశాఖలో ఫ్రెండ్స్‌తో సరదాగా ఏదో ఓ ప్రోగ్రామ్ వేసుకుంటూ, కాలాన్ని నిమిషాల్లా గడిపేసేవాడు. పైగా అడగ్గానే లేదనకుండా అన్న వదిన అతనికి కావలసినంత డబ్బు యిచ్చేవారు.

ప్రయాణపు హడావుడి అంతా సర్దుమణిగి, కాస్త వూపిరి పీల్చుకోవటానికి వీలు చిక్కగానే, అన్న వదినలకి చెప్పి మళ్ళీ విశాఖ వెళ్లాడు విశ్వం. పదిరోజులు ఫ్రెండ్స్‌తో కులాసాగా గడిపి తిరిగి వచ్చాడు ఏలూరు.

''బాబాయ్! మాకు కొత్త మిషనమ్మాయ్ దొరికిందిగా. మా బట్టలు ఎంత ఫ్యాషన్‌గా అందంగా కుట్టిందనుకున్నావు. మమ్మల్ని ముద్దు పెట్టుకుంటుంది. మేమంటే చాలా యిష్టం ఆవిడకి.''

విశ్వం యింట్లో అడుగు పెట్టగానే, అన్న కొడుకు, కూతురు, అతనికి వుత్సాహంగా అందించిన విషయాలివి.

ఆ సాయంత్రమే ఆ కొత్త మిషనమ్మాయ్ వచ్చింది.

అప్పుడే స్నానంచేసివచ్చిన విశ్వం, వదినతో మాట్లాడుతున్న ఆ అమ్మాయి వంక ఆసక్తిగా చూసాడు.

సుమారు యిరవై సంవత్సరాలు వుంటాయి. అంత అందమైనదికూడా కాదు. కానీ, తీర్చిదిద్దిన కనుముక్కుల్తో. అమాయకత్వం, నిర్లిప్తత పెనవేసుకుపోయి చురుగ్గా కదిలే కళ్లతో...ఓ వింత ఆకర్షణ వుందనిపించింది.

విశ్వం ఆసక్తిగా గుచ్చి గుచ్చి చూడటంతో ఆ అమ్మాయి యిబ్బందిగా ఫీలయింది. అది గమనించి విశ్వం లోపలికి వెళ్లిపోయాడు.

ఆ అమ్మాయిపేరు కమల అని. ఆ వీధికి నాలుగు వీధుల అవతల వుంటున్నారని, ఆమెకి మేనత్త తప్ప తల్లి, తండ్రి ఎవ్వరు లేరని, కమల మామయ్య పక్షవాతంతో తీసుకుంటున్నాడని, బాధ్యతతో యిల్లు చక్కదిద్దవలసిన బావ తాగుబోతు అని, కమల మామయ్యకి వచ్చే పెన్షన్ డబ్బు, కమల మిషన్ కుట్టగా వచ్చే ఆదాయమే ఆ యింటికి ఆధారమని, తను సేకరించిన వివరాలు మరిదికి వినిపించింది వర్ధనమ్మ.

విశ్వానికి ఆ క్షణంలో కమలమీద చెప్పలేని జాలి కలిగింది

కమల నాలుగు రోజులకోసారి అయినా ఆ యింటికి వస్తోంది. వర్ధనమ్మకి బట్టలిచ్చి ఎక్కువ కంటికి నచ్చిన బట్టలు ఏవీ పోనియదు నెలలో ఏ ఒకటి రెండ సార్లో తనకి, పిల్లలకి బట్టలు తీస్తూనే వుంటుంది.

వర్ధనమ్మ కబురు పెట్టగానే వస్తుంది

Learn ADMISSION OPEN

RADIO

AT HOME (ENGLISH, KANNADA & TAMIL MEDIUM)

Short term Course in Radio Engg. Duration 8 months
Transistor Course duration 3 months
American Method of Postal Tuition

Every one has to assemble a radio and IREE supplies Radio Kit, Transistor Kit, Text books, Tools, Printed notes etc., with clear instruction charts. For further details, prospectus, application forms write to Principal, IREE, Southend Road, Bangalore-4 with Rs. 1/- M.O. or postal stamps.

Principal K. L. V. Iyer.



నన్ను నన్నుగా ప్రేమించు

కమల. అవసరం తనది గనక. మిగతావాళ్ళ బట్టలకి ఎలా యిచ్చినా వర్దనమ్మ నుంచి కుట్టుకూలి మాత్రం ఎక్కువగా వస్తుండి. అదిగాక యిరుగు పొరుగు వాళ్ళకి కూడా చెప్పి వాళ్ల బట్టలు యిస్తోంది.

ఒకరోజు కమల కుట్టిన బట్టలు తీసుకు వచ్చింది. అప్పుడు విశ్వం పుస్తకం చదువుతూ యింట్లోనే వున్నాడు. ఆమెను చూస్తూనే పలకరింపుగా నవ్వాడు. బిడియంతో చటుక్కున చూపులు తిప్పుకొంది కమల.

"జయా మీ స్నేహితురాలు వచ్చిందోయ్" అంటూ లోపలికి కేకవేశాడు విశ్వం.

తనుగాక యింకెవరైనా చిన్నపిల్లలు వచ్చేరేమోనని వెనక్కి తిరిగి చూసింది కమల. ఆమె అమాయికత్వానికి నవ్వొచ్చింది విశ్వానికి. ఇంతలో పదేళ్ల పిల్ల "ఎవరు బాబాయ్!" అంటూ బయటకొచ్చింది.

"అదిగో, ఆవిడే. నీ బెస్టు ఫ్రెండ్ అని నాతో చెప్పావుగా!" అన్నాడు.

అప్పటికి అర్థంచేసుకున్న కమల సిగ్గుపడి పోయింది.

"నీ రోజ్ కలర్ ఫ్రాక్ సాయంత్రం యిస్తానమ్మా!" అంటూ తెచ్చిన బట్టలు ఆ పిల్ల చేతిలో పెట్టి గబగబా బయటకి వెళ్లిపోయింది.

మరో రోజు అర్జంటుగా కొత్తగా ఫ్రెండ్ అయిన ఒకతని బర్త్‌డే పార్టీకి బయలు దేరాడు విశ్వం. తీరా తనకి ఎంతో యిష్టమైన షర్టు వేసుకోబోతే, దానికి ఓ చోట చిరుగు కనిపించింది.

ఆ షర్టు అలా చేసుకువచ్చిన లాండ్రీవాళ్ళ మీద కాసేపు విసుక్కున్నాడు. ఆ తర్వాత కుట్టు కనిపించని విధంగా కమల రఫ్ తీస్తుందని వదినచెబితే. ఆమె దగ్గరకి బయలు దేరాడు

విశ్వం యింటోకి అడుగు పెట్టబోయి, బిగ్గరగా వినిపిస్తున్న అరుపులకి ఆగిపోయాడు. లోపల పార్వతమ్మ, ఆవిడగారి సుపుత్రుడు కలిసి ఎందుకో కమలని దుయ్యబడుతున్నారు.

మిషన్ దగ్గర నిలబడి తలవంచుకుని మౌనంగా ఆ తిట్లను భరిస్తున్న కమలను చూడగానే విశ్వానికి జాలేసింది.

"ఎలా తెస్తావో నాకు తెలియదు. వుదయానికల్లా నాకు పది రూపాయలు యివ్వాలి." బెదరిస్తున్నట్టుగా అర్జని





చూపించి విశ్వం పక్కనుంచే విసురుగా బయటకు వెళ్ళిపోయాడు అతను.

ఆ గొడవకు కారణం కొంత అర్ధమయింది విశ్వానికి. యింటి బాధ్యతనువదలుకుని పైగా తాగటానికి కాబోలు డబ్బులు యివ్వమంటున్నాడు. ఛీ...ఛీ...ఆ తల్లీ కొడుకుల్ని దులిపెయ్యాలన్నంతకోపం వచ్చింది.

ఎందుకో ఇటువేపు తిరిగిన కమల విశ్వాన్ని చూసి ముందు తెల్లబోయింది. ఆ వెంటనే కంగారుగా కంట్లో నలక పడిన దానిలాకళ్ళు గట్టిగా వత్తుకుంది. వత్తే కొద్దీ కంట్లో నీళ్ళు. మనసులో బాధ అధికమయ్యాయేగానీ, తగ్గలేదు. అయినా ఆ బాధని అణచుకోవటానికి ప్రయత్నిస్తూ...

"రండి! కూర్చోండి!" అంటూ మూల నున్న చెక్క కుర్చీ తెచ్చి మిషనుకు దగ్గరగా వేసింది.

అంత బాధలో కూడా పెదవులమీద తెచ్చి పెట్టుకున్న చిరునవ్వు మాటల్లో ఉత్సాహం చూస్తుంటే, ఆమె గుండె నిబ్బరానికి మెచ్చుకోకుండా వుండలేక పోయాడు విశ్వం.

అతనికి కాఫీ యిచ్చేపాటి స్వతంత్రత కూడా తనకి లేనందుకి కమల సిగ్గుతో తల వంచుకుంది. విశ్వం అది గ్రహించాడు. అయినా గ్రహించనట్టే, తను వచ్చిన పని చెప్పాడు.

విశ్వం వదిన చెప్పినట్టు కమల నిజంగా అలాగే కుట్టింది. కాని చిన్న పొరపాటు జరిగిపోయింది. పార్వతమ్మ చిన్న కొడుకు పదిహేనేళ్లవాడు. ఓ పాతగుడ్డ తెచ్చి తనకు అర్జెంటుగా అది రెండు ముక్కలుగా కట్ చేసి యివ్వమని తొందర చేసాడు.

అది కట్ చేసేటప్పుడు, దాని అడుగున వున్న షర్టుకూడా చాలా భాగం కట్ అయిపోయి పనికిరాకుండా పోయింది. జరిగిన పొరపాటు చూస్తూనే కమలకి మతి పోయినట్టయింది.

విశ్వం పరిస్థితి కూడా అలాగే వుంది. కొద్ది నిముషాల క్రితం కమలపట్ల సానుభూతితో నిండిపోయిన అతని మనసు, ఆ క్షణంలో చెప్పలేని చిరాకు కోపంతో నిండిపోయింది. అతని తత్వమే అంత. వచ్చిన కోపాన్ని నిగ్రహించుకోవటం అతనికి చాతకాదు. ఇప్పుడు అంతే అయింది.

"మా వదిన ఎంతో గొప్పగా చెబితే తీసుకొచ్చాను. నీ నిర్లక్ష్యంతో దాన్ని అస్సలు పనికిరాకుండా చేసావు!" అన్నాడు అసహనంగా.

కమల మనసు చివుక్కుమంది. అతను ఆవేశంతో ఏమి టేమిటో అంటూనేవున్నాడు. తప్పు తనది కాబట్టి పెదవి విప్పలేకపోయింది కమల.

"దాని ఖరీదు ఎంతో చెప్పండి!" చివరికెలాగో మెల్లగా అడిగింది.

"అక్కర్లేదు." అంటూ విశ్వం విసురుగా చేయిచాచి మిషన్‌మీద షర్టు అందుకోబోయాడు.

హఠాత్తుగా చేతిమీద వెచ్చగా తగిలేసరికి వులిక్కిపడి తలెత్తి చూసాడు. కమల చెక్కిలి మీదనుంచి కన్నీరు ధారగా జాలువారుతోంది. విశ్వం కోపం మంచులా కరిగిపోయినట్టయింది.

"కమలా!" అన్నాడు కంగారుగా.

కమల గబగబా కన్నీళ్ళు తుడుచుకుని, మొహం పక్కకి తిప్పుకొంది.

విశ్వం మనసు బాధతో మెలితిప్పినట్టయింది. తను యింట్లోకి రాగానే కనిపించిన సంఘటన గుర్తుకొచ్చి, తన ప్రవర్తనకి సిగ్గుపడ్డాడు.

"ఐయామ్ సారీ కమలా!" అన్నాడు బాధగా.

"ఫర్వాలేదు. తప్పు నాది. దయచేసి దాని ఖరీదు చెప్పండి!"

"దానికి ఖరీదు కట్టడం నా కిష్టంలేదు. యిష్టమైన వస్తువు యిక పనికి రాదనుకుంటే ఎవరి మనస్సైనా ఎలా వుంటుంది చెప్పు? నాకు కొంచెం కోపం ఎక్కువ. నిజం. ఒట్టు. ప్లీజ్ నామాటలేవీ మనసులో వుంచుకోకు!" మనస్ఫూర్తిగా అర్ధించాడు విశ్వం.

కమల పెదవి విప్పి ఏదో చెప్పబోయింది మళ్ళీ.

"ప్లీజ్! యిక ఈ విషయం మరిచిపో!" అంటూ హఠాత్తుగా ఆమె చేయి అందుకొని ముద్దుపెట్టి, గబగబా బయటికి వెళ్ళిపోయాడు.

ఈ చర్యకి కమల బిత్తరపోయింది కొద్ది క్షణాల తర్వాత విశ్వం స్పర్శ, ఆ స్పర్శలోని అనుభూతి, మాటల్లోని మార్దవం. కమల మనసుని పులకరింప చేసాయి.

ఈ సంఘటన మానసికంగా ఆ యిద్దర్నీ దగ్గరికి చేర్చింది. ఆ రోజు తర్వాత విశ్వం కమలతో ఎప్పుడూ నిర్లక్ష్యంగా, కోపంగా ప్రవర్తించలేదు. తరచు అతను కమల యింటికి కూడా వచ్చేవాడు షర్టు కుట్టమనో, బనీను లేక టెయిలాన్ సాక్సో పెట్టుకుని వచ్చేవాడు.

అతని అమాయకత్వం, చిలిపితనం చూస్తుంటే కమలకి నవ్వొచ్చేది. ఒక్కోసారి భయంకూడా కలిగేది. ఈ ఆత్మీయత సంబంధం ఏ క్షణంలోనైనా తనకి దూరమైపోతుందేమో

అని. తను లేనిపోని ఆశలు పెంచు పెంచుకుంటుందేమో అని

అయితే కమల భయాలు కొద్ది రోజుల్లోనే నిజమయ్యాయి.

విశ్వానికి పెళ్లి అని తెలిసినరోజున, కొద్ది క్షణాల కాలం స్తంభించిపోయినట్టే అనిపించింది కమలకి. కమల బాధకి కారణం అతని నుంచి దూరమైపోవటం ఒక్కటేకాదు. తన దురదృష్టం యింకా తనను విడిచిపెట్టనందుకు, తన కష్టాలు కలలోకూడా అంతం కావటానికి భయపడుతున్నందుకు.

విశ్వానికి ఆ సంబంధం మూడేళ్ళుగా అనుకుంటున్నదే. ఆ అమ్మాయి వర్ధనమ్మకు బాబాయి కూతురు. ఒక్కటే పిల్ల. ఆస్తి వున్నవాళ్ళు.

ముందు విశ్వం తనకి వుద్యోగం వచ్చే వరకు పెళ్లి చేసుకోనని తప్పించుకోబోయాడు. కానీ ఫలితం కనిపించలేదు.

తనకి పెళ్లి వద్దని అన్నాడేతప్ప, కమలని ప్రేమిస్తున్నానని ధైర్యంగా చెప్పలేకపోయాడు. కారణం తను పరాధీనుడు కనుక. చిన్నతనం నుంచి తను ఆడింది ఆటగా, కన్నబిడ్డకన్నా ఎక్కువగా తనని పెంచారు వాళ్ళు. బాధ్యతని గుర్తించలేని అతని నిర్లక్ష్యం, ఆ పెళ్లికి తల వంచేలా చేసింది.

కమలని కలుసుకొని పరిస్థితులు వివరించి క్షమాపణలు కోరుకోవాలనుకున్నాడు. కానీ మొహం చెల్లలేదు. అసలు రెండుమూడు సార్లు ఆ యింటికి వచ్చినా కమల అతనికి ఆ అవకాశం యివ్వలేదు.

పెళ్ళికి పదిరోజులు ముందుగానే వర్ధనమ్మ తనవి పిల్లలవి బట్టలు యిచ్చింది కమలకి. రెండు రోజులకే అన్నీ కుట్టి తీసుకొచ్చిన కమల చూపు ఒక్కక్షణం విశ్వం చూపుతో కలుసుకుంది.

ఆ చూపులోని భావాలు, వేదన విశ్వం ఎన్నడూ మరిచిపోలేడేమో. బట్టలు యిచ్చి తిరిగి వెళ్ళిపోతున్న కమల్ని చూసి కంగారుగా...

''కమలా! నీతో మాట్లాడాలి!''అన్నాడు.

''వద్దు! మీరు నాకు సంజాయిషీ చెప్పొద్దు!'' అంది మామూలుగా.

''అది కాదు కమలా! ఈ పెళ్లి ...''

''దేవుడు నిర్ణయించింది. నన్నేదో మోసం చేస్తున్నాననే అపోహతో, మరో ఆడపిల్ల మనసు మాత్రం బాధపెట్టకండి!'' నిర్లిప్తంగా అనేసి సమాధానానికై చూడకుండా వెళ్ళిపోయింది.

మనిషి ఆలోచనలతో ప్రమేయం లేకుండానే కాలం వెనక్కి పరుగులుతీసోంది పెళ్ళి ఒండురోజుల్లోకి వచ్చింది. ఆ మర్నాడు సాయంత్రమే ఆడపెళ్ళివారి యింటికి తరలి వెళ్ళాలి. యిల్లంతా బంధువులతో నిండిపోయింది.

పెళ్లికి రాలేని ఫ్రెండ్స్ దగ్గర నుంచి. రకరకాల గ్రీటింగ్స్, బహుమతులు వస్తున్నాయి.

ఆరోజు పోస్టులో వచ్చిన రిజిష్టర్ అందుకుని సంతకం చేసాడు విశ్వం. ప్యాకెట్ విప్పి చూస్తూనే విస్తుపోయాడు. పాకెట్ సైజ్ కన్నా కాస్త పెద్ద పుస్తకం. విశ్వాన్ని అమితంగా ఆశ్చర్యపరిచిన సంగతి' మొదటి పేజీలో అందంగా. పొందికగా, సిరాతో రాసిన 'కానుక' అన్న అక్షరాలు. చూడగానే అదొక స్టోరీ అని గ్రహించాడు.

కుతూహలంగా మధ్యపేజీలు తిరగేశాడు. ఓ పేజీ అతని దృష్టి నాకట్టుకుంది. ఆ పేజీ ఆశాంతం చదివేసరికి అతని మొహం, నెత్తురు చుక్క లేనట్టు, తెల్లగా పాలిపోయింది.

అనుమానం, ఆతృత అతన్ని క్షణం వూపిరి తీసుకోనివ్వలేదు గబగబా గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకుని ఆ పుస్తకం మొత్తం చదివేశాడు. ఆ పుస్తకం పూర్తిఅయ్యేసరికి, అతని మనసంతా మొద్దుబారిపోయి, తెల్ల కాగితంలా తయారయింది.

తల్లి తండిలేని కమల అత్తయ్య ఆధీనంలో ఎన్ని కష్టాలలో పెరిగిందో. అనుక్షణం ఆ ఇంట్లో ఎలాంటి నరకాన్ని అనుభవించిందో, ఎడారిలో ఒయాసిస్సులా, విశ్వం పరిచయం. ఆమె మనసులో ఎలాంటి ప్రశమనాన్ని, వుత్తేజాన్ని కలిగించిందో తీరని అఘాతంలా, కొడిగట్టిన దీపంలా దూరమైన అతని ఆత్మీయత ఎంత అశనిపాతాన్ని కలిగించిందో, విపులంగా ప్రతి సంఘటన సంభాషణ దానిలో వివరించి వున్నాయి.

అది చదువుతున్నంతసేపు విశ్వం కళ్లు వర్షిస్తూనే వున్నాయి. కమలకి తీరని ద్రోహం చేసున్నానేమో అన్న బాధ. అతని శరీరాన్ని అనిర్వచనీయమైన ఆవేదనతో నలిపేసింది.

'బాధ్యత గుర్తించలేని నిర్లక్ష్యం తనని ఈనాడు అన్యాయం తప్పే చేసింది. ఈ సమస్యని పరిష్కరించుకోవటం ఎలా?...' విశ్వం ఆ రాత్రంతా నిద్రలేకుండా అలా ఆలోచిస్తూనే వున్నాడు.

ఈ రోజుల్లో పీటలమీద పెళ్ళిళ్ళు ఎన్నో తప్పిపోతున్నాయి. ఈ పెళ్లి తప్పిపోయినా తమ హోదాతో కట్నం కుమ్మరించి వాళ్ళు మరో పెళ్లికొడుకును కొనగలరు. కానీ.కమలకి ఆ అదృష్టం వుందా?...

అందుకే ఆ మర్నాడు వుదయమే విశ్వం యింట్లో ఎవ్వరికీ, ఏమీ చెప్పకుండా కమల యింటికి వచ్చాడు. అయితే కమల కనిపించ

ఉపగ్రహం ద్వారా చేపల వేట

వాషింగ్టన్ - లూయిజియానాలో జరిపిన ఒక అసాధారణ ప్రయోగం ద్వారా, జాలరులు, ఇంజనీర్లు, భౌతిక శాస్త్రవేత్తలు, సాగర శాస్త్రజ్ఞులు, జీవ శాస్త్రజ్ఞులు, కంప్యూటర్ నిపుణులతో కూడిన ఒక బృందం కృత్రిమ ఉపగ్రహం సహాయంతో చేపలను కనుగొన్నారు.

ఉపగ్రహం నేరుగా చేపలను ''చూడ''లేదు. అయితే నీటి రంగును ఇది కనిపెట్టగలదు. గుంపులు గుంపులుగా తిరిగే చేపలు నీటి ఉపరితలాన్ని చిందర వందర చేస్తుంటాయి. అందువల్ల నీటిరంగు కూడా మారుతుంటుంది. ఈ రంగు మార్పు ద్వారా అక్కడ చేపల గుంపులు ఉన్నట్లు శాస్త్రజ్ఞులు తెలుసుకొంటారు. సాగరాల లోని నీరు ఈ విధంగా రంగులు మారటాన్ని గురించి ఉపగ్రహం శాస్త్రజ్ఞులకు తెలుపుతుంది.

ఉపగ్రహం పంపే ఇలాంటి సమాచారం ఆధారంగా–అన్నిచోట్ల గాకపోయినా–ఎక్కువ చోట్ల చేపల గుంపులు ఉన్నట్లు చేపలు పట్టే నౌకలు కనుగొన్నాయి.

తీరప్రాంతాలలో చేపల వేటకు ఈ పద్ధతిని సమర్థంగా వినియోగించుకోవచ్చు. అమెరికా జాతీయ మెరిటైమ్ ఫిషరిస్ సర్వీస్ ప్రయివేటు కంపెనీలు ఈ పథకంతో సహకరిస్తున్నాయి.

లేదన్న వార్త అతనికి పిడుగుపాటే అయింది.

* * *

ముసలాయన దగ్గు తెర విశ్వాన్ని వాస్తవం లోకి తెచ్చింది.

పార్వతమ్మ కొడుకు ఎప్పుడు వచ్చాడో కూడా విశ్వం గమనించలేదు. మళ్ళీ తాగి వచ్చినట్టున్నాడు, తెగ వాగుతున్నారు.

విశ్వం వచ్చి ఆరుగంటలు అవుతున్నా, కమల ఏమైందన్న విషయం అంతుబట్టటం లేదు. యింట్లో వాళ్ళు పట్టించుకున్నట్టే లేదు. క్షణాలు దొర్లిపోతుంటే, విశ్వం మనసు బాధతో బరువెక్కిపోతోంది.

మరోసారి వీధిలోకి చూడబోయిన విశ్వం స్తంభించిపోయాడు. లోపలికి అడుగు పెట్టబోతున్న కమలకూడా అతన్ని చూసి నివ్వెరపోయింది.

ఆమె పక్కనే పంచెకట్టులో ముప్పై అయిదేళ్ళ వ్యక్తి వున్నాడు. కమలకి చెరో పక్క పది, ఎనిమిదేళ్ళ ఆడపిల్లలు నిలబడి వున్నారు.

విశ్వం చూపు ఆ ఎవ్వరిమీద లేదు. కమల మెడ మీదుగా పచ్చని తాడుకి వేలాడుతున్న మంగళసూత్రాన్ని పిచ్చిగా చూస్తున్నాయి.

యివతలకి వచ్చిన తల్లీకొడుకులు కూడా వీళ్ళని చూస్తూనే తెల్లబోయారు.

ఆ వ్యక్తి ఎవరో విశ్వానికి తెలుసు. ఒకే ఒక్కసారి కమల పరిచయం చేసింది, మనసున్న మంచి వ్యక్తిగా.

అతని పేరు పరమేశం. అతనికి భార్య లేదు. చనిపోయి ఐదారేళ్ళు అవుతోంది. కమల వాళ్ళు సంవత్సరం క్రితం వుండి వచ్చిన యింటిపక్కన వుండేవాళ్ళు. తల్లి పోయిన దగ్గరనుంచి ఆ పసిపిల్లలు కమలకి బాగా చేరిక అయ్యారు. పదేళ్ళుగా పక్క వాటాలో వుంటూ, పార్వతమ్మ కమలను పెట్టే బాధలు, కమల సహనం, మంచితనం అర్థంచేసుకున్న వ్యక్తి ఆయన.

కమల వాళ్ళు యిక్కడికి కొచ్చేసినా, ఆయన అప్పుడప్పుడు వచ్చేవాడు. ఈ విషయాలన్నీ కమల వివరించిన పుస్తకంలో ఓ భాగమే.

'అయితే అతన్ని వివాహం చేసుకుంటున్నట్టు ఎందుకు రాయలేదు. తనుకాదన్నాడని పంతానికి ఆ రెండో పెళ్ళి వాణ్ణి చేసుకుందా?'

కానీ అసలు కారణం కమలకీ ముసలాయనకి తెలుసు.

నన్ను నన్నుగా ప్రేమించు

మనసుని చంపుకుని, బాధ్యతని మరచిపోయి, యిష్టంవచ్చినట్టు హింసించే కొడుకు అమానుషానికి తట్టుకోలేక, ఎనిమిదేళ్ళ సంసార బంధాన్ని తెంపుకుని, ఎవరితోనో లేచిపోయింది కోడలు.

చాకిరీచేసే ఓ యంత్రంలా, యీ యింటికి తిరిగిన పెన్నిధిలా కనిపిస్తున్న కమలకి, కొడుకుచేత ఉరితాడు బిగించి, శాశ్వతమైన ఆనందాన్ని, సుఖాన్ని పొందాలని చూసింది పార్వతమ్మ. కొడుకుకూడా అంతే

చివరి రక్తపు బొట్టు వరకు కరిగించి తన శ్రమను ధారపోసినా తనకి ఈ ఇంటో మనశ్శాంతి దొరకదు. ఆ కుటుంబం బాగుపడదు. పరమేశం వ్యక్తిగతంగా తనని అభిమానిస్తున్నాడు. భార్య పోయిన తర్వాత కమలని తనయింటి దీపంగా చేసుకోవాలని అతనికి వున్నా, అతని సంస్కారం పెదవి విప్పనీయలేదు. ఈ విషయాలన్నీ కమలకి తెలుసు.

పై వారమే

క్షయ

ప్రత్యేక వ్యాసావళి

తను ప్రేమించినవాళ్ళ నుంచి తనకేం దక్కిందని. అందుకే నిన్న పరమేశం దగ్గరికి వెళ్ళి, తన మనసులోని మాట చెప్పింది. ఆయన సంతోషంగా ఒప్పుకున్నాడు.

ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా వుదయమే అతని దగ్గరికి వెళ్ళింది. అతని ఆఫీస్ కొలీగ్స్ సమక్షంలో, గుడిలో, దైవసాక్షిగా అతని అర్ధాంగి అయి, తిరిగి వచ్చింది.

తను కానుకగా పంపించిన పుస్తకం... తన జీవితం అతనిలో సంచలనం కలిగించిందని, అతను అన్ని బంధాలు తెంచుకుని వచ్చాడని విశ్వం ద్వారా విన్న కమల కొయ్యబారిపోయింది.

"ఎంత పొరపాటు చేసారు!" అంది చివరికెలాగో.

"నేను చేసింది పొరపాటా?" అన్నాడు విశ్వం నిష్ఠూరంగా.

"అవును. నేను ఆ కానుక పంపించింది ఓ స్నేహితురాలిగా. నా కష్టాల్ని, జీవిత సత్యాల్ని అర్థం చేసుకుని, మీ బాధ్యతల్ని గుర్తించి, మనిషిగా పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని పొందాలనిగానీ, యిలా కళ్యాణ తిలకం చెరుపుకుని, కాళ్ళ పారాణి అయినా ఆరనిమరో కన్నెపిల్ల జీవితాన్ని కాలదన్ని రమ్మనికాదు!"

"అయితే నామీద నీకున్న ప్రేమ యింతే నన్నమాట!" అపహాస్యంగా అడిగాడు విశ్వం.

అతని ఆవేశానికి కమలకి బాధ కలగలేదు. జాలేసింది.

"అది పిచ్చి ప్రశ్న. 'నువ్వు ఎవర్ని ప్రేమించలేదూ?' అని అడగండి. ఆత్మీయత కోసం అలమటించిపోతూ, అంతరాలు మరిచిపోయి అందర్ని ప్రేమించాను. కానీ నాకు జాలి,సానుభూతి తప్ప ఎవ్వరి నుంచి నే కోరుకున్నది అందలేదు. "నన్ను నన్నుగా ఎవ్వరూ ప్రేమించలేదు..." దుఃఖంతో చటుక్కున ఆగిపోయింది కమల.

అంతా బొమ్మల్లా చూస్తుండిపోయారు.

"నన్ను నన్నుగా ప్రేమించింది ఈయన ఒక్కరే. బాధ బాధ్యతల మధ్య సంఘర్షణతో నలిగిపోయే నా హృదయాన్ని, క్షమని, వ్యక్తిగతంగా ప్రేమించిన వ్యక్తి ఈయన. నేను సంపాదిస్తున్నంతవరకు అత్తయ్య బావని బాధ్యత తెలుసుకోనివ్వదు. యిన్నాళ్ళు అన్ని విధాలుగా అందర్ని ప్రేమించి నా మనసు అలసిపోయింది. యిన్నాళ్ళకి. యిన్నేళ్ళకి నా అలసిన మనసుకి ఆలంబన దొరికింది ..." అంది.

కమల గొంతులో నిశ్చింత వ్యక్తమౌతోంది. మొహంలో ఓ విధమైన సంతృప్తి వింతగా ప్రతిఫలిస్తోంది. విశ్వం పిచ్చివాడిలా, బొమ్మలా, చూడటం తప్ప ఏం మాట్లాడలేకపోతున్నాడు.

"మీ పెళ్ళికివచ్చే అవకాశం లేదు నాకు. ఆయనకి ట్రాన్స్‌ఫర్ అయింది. ఈ రాత్రికే నెల్లూరు వెళ్ళిపోతున్నాము. నన్ను క్షమించండి!" అంటూ గబగబా లోపలికి వెళ్ళిపోయింది కమల.

తనకి ఆవేశమేగానీ ఆలోచన లేదు. సరదాలు తప్ప బాధ్యత తెలియదు. నిజంగా ఆమె కష్టాల పరంపర చదివి కదూ తను వచ్చాడు. అంటే... జాలిపడే కదూ ?

'నన్ను నన్నుగా ప్రేమించు' కమల మాట చెవుల్లో హోరుగా వినిపిస్తోంది. 'తనకా అర్హత లేదు' గిరుక్కున వెనక్కి తిరిగి గబగబా బయటకి నడిచాడు విశ్వం.

పరమేశం జాలిగా నిట్టూర్చాడు.